నేడు పాలి సెట్

పాలిటెక్నిక్ కళాశాలలో నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

నిర్మల్ అర్బన్/ఎదులాపురం, మే 23 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నేడు(శుక్రవారం) పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఐదు, ఆదిలాబాద్‌లో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్‌లో 1,946 మంది, ఆదిలాబాద్‌లో 1,059 మంది పరీక్ష రాయనున్నారు. కేంద్రాలను నిర్మల్‌లో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఆదిలాబాద్‌లో పాలిటెక్నిక్ కళాశాల అధ్యపకురాలు, పాలిసెట్ అబ్జర్వర్ జ్యోత్స్న పరిశీలించారు.

ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలి..

రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

తడిసిన వడ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఉట్నూర్ రూరల్, మే 23 : ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. గురువారం ఉట్నూర్, బిర్సాయిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం తేమ శాతాన్ని చూసి త్వరగా తూకం వేయాలని, వర్షాలు కురుస్తుండడంతో రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం సంధ్యారాణి, సివిల్ సప్లయ్ డీటీ గోడం త్రిఅంబక్‌రావు, డీపీఎం శోభారాణి, టీఏ సుధాకర్, ఏఈవోలు సాయికృష్ణ, సుధాకర్, సీసీ సరస్వతి పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రూ.5 లక్షల పరిహారం అందించాలి..

తాంసి(తలమడుగు), మే 23 : గాలివాన బీభత్సంతో నష్టపోయిన గ్రామస్తులకు నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం తలమడుగు మండలంలోని పూనగూడ, చింతగూడ, మందగూడ గ్రామాల్లో మండల నాయకులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు, తాగునీరు అందించాలన్నారు. ఆస్తి నష్టం జరిగిన కుటుంబాలకు రూ.5లక్షలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు అభిరాం రెడ్డి, మగ్గిడి ప్రకాశ్, కాటిపెల్లి శ్రీనివాస్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, జనక్ పటేల్, రాంబాయి, గంగాధర్, ఆశన్న యాదవ్, ఎంపీటీసీ చంటి, గజానన్, ప్రకాశ్‌రెడ్డి, రవికాంత్ యాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండ : ఎమ్మెల్యే

గాలివాన బీభత్సంతో నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం వరంగల్ జిల్లా నుంచి ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా చూడాలన్నారు.

ప్రైవేట్ బస్సుల ఇష్టారాజ్యం

● ఆదిలాబాద్ జిల్లా మీదుగా ఉత్తరాది రాష్ట్రాలకు సర్వీసులు ● అనుభవం లేని డ్రైవర్లు.. పరిమితికి మించి ప్రయాణం ● నిబంధనలకు విరుద్ధంగా వస్తువుల రవాణా

ఆదిలాబాద్, మే 23(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్ బస్సుల ఇష్టారాజ్యం కొనసాగుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను చేరవేస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు ఉట్నూర్ ప్రాంతాల నుంచి రోజు హైదరాబాద్‌కు ప్రయాణికులను చేరవేస్తాయి. జైనథ్ మండలంలోని డొల్లర నుంచి నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ వరకు 80 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి రోజు జిల్లాలోని జాతీయ రహదారి మీదుగా ఉత్తరాది రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ప్రయాణికులతో కూడిన ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వందల కిలోమీటర్ల ప్రయాణం చేస్తున్న ప్రైవేట్ బస్సుల యజమానులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అనుభవం లేని డ్రైవర్లు, బస్సుల ఫిట్‌నెస్ నిర్వహణ సరిగా ఉండకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బుధవారం అర్ధరాత్రి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు 50 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో గల మహబూబ్‌ఘాట్ దిగిన తర్వాత ప్రమాదానికి గురైంది. బస్సు డ్రైవర్ మితిమీరిన వేగంతో నడపడంతో ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు అంటున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే బస్సులు పరిమితి కంటే ఎక్కువ ప్రయాణికులను చేరవేస్తున్నాయి. ఇలాంటి బస్సుల్లో ప్రమాదాలు జరిగితే బాధితులు సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

నిర్మల్ జిల్లాలోని మహబూబాఘాట్ వద్ద బోల్తా పడ్డ ప్రైవేట్ బస్సు

యథేచ్ఛగా వస్తువుల రవాణా

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేటు బస్సులు యథేచ్ఛగా లగేజీ, ఇతర వస్తువులను రవాణా చేస్తున్నాయి. బస్సు లోపల, డిక్కీ, టాప్, పక్క భాగాల్లోని ఖాళీ ప్రదేశాల్లో వస్తువులను పెట్టి చేరవేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మూడు ట్రావెల్స్‌కు చెందిన బస్సులు ప్రయాణికుల కంటే లగేజీ రవాణాకు ప్రాధాన్యం ఇస్తాయి. ఉదయం సమయంలో బస్టాండ్ ప్రాంతంలో లగేజీతో కూడిన బస్సులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుండడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. గతంలో జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఓ ట్రావెల్ బస్సులో నిషేధిత వస్తువులు చేరవేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. కొందరు వ్యాపారులు జీఎస్టీ లేకుండా వివిధ రకాల వస్తువులను చేరవేయడానికి ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతన్నది. అధికారులు స్పందించి ప్రైవేట్ బస్సుల యజమానులు నిబంధనలు పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు బోల్తా | మహిళ మృతి.. 25 మందికి గాయాలు..

సారంగాపూర్, మే 23 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మహబూబ్ ఘాట్ వద్ద బుధవారం అర్ధరాత్రి ప్రైవేటు ట్రావెల్ బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో 25 మంది ప్రయాణికులకు గాయాలు కాగా, ఒక మహిళ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఏపీ 01 ఎక్స్ 6694 అనే నంబర్ గల ముస్కాన్ ట్రావెల్ బస్సులో 49 మంది ప్రయాణికులు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అయితే మహబూబ్‌ఘాట్ సమీపంలో గల రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద బస్సు అతివేగంగా వచ్చి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 25 మందికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం 108లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఇందులోని ఫర్హానకు తలకు, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృత్యువాత పడింది. గాయాలైనవారు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సు డ్రైవర్ మహ్మద్ ఇర్ఫాన్ హైమద్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

పాకురుతో ఉన్న నీటి క్యాన్‌లు

మినరల్ దందా

● పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు
● నాచు, పాకురు ఉన్న ట్యాంకుల్లో నీటి నిల్వ
● ఏళ్ల నాటి క్యాన్లలో సరఫరా.. వ్యాపారస్తులకు గిరాకీ
● కరువైన అధికారుల పర్యవేక్షణ

ఎదులాపురం, మే 23 : తుప్పు పట్టిన యంత్రాలు, ఏళ్ల తరబడి వాడుతున్న క్యాన్లు, నాచు, పాకురుతో నీటి నిల్వ ట్యాంకులు, పరిసరాల్లో పరిశుభ్రత పాటించకుండా అనుమతులు లేని వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఫలితంగా ఆరోగ్యం కోసం కొనుగోలు చేస్తున్న మంచినీరుతో అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు ప్లాంట్ల నిర్వాహకులు, డబ్బులే పరమావధిగా మినరల్ దందాను కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడంతో ప్లాంట్ల నిర్వాహకుల ఆగడాలను అరికట్టేవారు లేకుండా పోయారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 49 వార్డుల్లో వార్డుకు 5 నుంచి 10 మినీ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. సాధారణంగా వాటర్ క్యాన్‌కు రూ.10-రూ.15లు తీసుకుంటుండగా.. కూల్ క్యాన్‌కు రూ.20-రూ.25 ధర పలుకుతున్నది. పట్టణంలో సుమారు 2 లక్షల లోపు జనాభా ఉండగా.. వీరికి నీటిని సరఫరా చేసి లక్షలు దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఐఎస్ఐ ప్రమాణాలకు గాలికొదిలేసి చేస్తున్న వ్యాపారాలపై కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్ష బీభత్సం

ఓలా గ్రామంలో నేలకొరిగిన పది విద్యుత్ స్తంభాలు

● పాక్షికంగా ధ్వంసమైన ఇండ్లు
● కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

కుంటాల, మే 23 : బుధవారం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు మండల వ్యాప్తంగా 20 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఓలాలో పది విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, పలు చోట్ల తీగలు తెగిపడి కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వేప చెట్టు కొమ్మ విరిగిపడింది. పలు చోట్ల హరిత హారం చెట్లు గాలి దుమారానికి విరిగిపోయాయి. కొన్ని ఇండ్లపై కప్పులు లేచిపోయి పాక్షికంగా దెబ్బతిన్నాయి. తహసీల్దార్ అహ్మద్ ఖాన్, గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో రహీం, ఆర్ఐ అడెల్లు, ఎంపీటీసీ రవి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు హైమద్ పాషా దెబ్బతిన్న ప్రదేశాలను పరిశీలించారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలను సరిచేస్తున్నట్లు ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉంటే సిబ్బందికి తెలియజేయాలని ప్రజలను కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. తేమ శాతం రాదేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఓలాలో చెట్టు విరిగి పడడంతో తెగిపడ్డ విద్యుత్ తీగలు

జొన్న కొనుగోళ్లు వేగవంతం

● 26 వేల టన్నుల సేకరణ ● 31 వరకు పూర్తిస్థాయి కొనుగోళ్లకు చర్యలు ● అధికారుల విస్తృత పర్యవేక్షణ

ఆదిలాబాద్, మే 23(నమస్తే తెలంగాణ) : వర్షాకాలం సమీపిస్తుండడంతో జిల్లావ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు చేపట్టారు. జొన్నల కొనుగోళ్లను వేగవంతం చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాల్లో జొన్నల కొనుగోళ్లు జరుగుతుండగా.. ఇప్పటికే 26 వేల టన్నులను సేకరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మార్కెట్‌యార్డుల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. బుధవారం వరకు ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో 3277 మంది రైతుల నుంచి 79,056 క్వింటాళ్లు, బేల మార్కెట్ యార్డులో 550 మంది నుంచి 11,458, జైనథ్ మార్కెట్ యార్డులో 2044 మంది నుంచి 35,597, హస్నాపూర్ మార్కెట్ యార్డులో 244 మంది నుంచి 961, నార్నూర్ మార్కెట్ యార్డులో 297 మంది నుంచి 6,988, ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో 375 మంది నుంచి 7737, బోథ్ మార్కెట్ యార్డులో 1739 మంది నుంచి 38,205, ఇచ్చోడ మార్కెట్ యార్డులో1911 మంది నుంచి36,455, తాంసిమార్కెట్‌యార్డులో 1407 మంది నుంచి 30,511 క్వింటాళ్ల జొన్నలను సేకరించారు.

తాంసిలో కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి

31 వరకు పూర్తిస్థాయి కొనుగోళ్లు

జొన్నల కొనుగోళ్లను ఈ నెల 31 వరకు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. 40 వేల టన్నుల పంట అమ్మకానికి వచ్చే అవకాశాలు ఉండడంతో అకాల వర్షాల కారణంగా పంట కొనుగోళ్లలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి పంట తడవకుండా ప్లాస్టిక్ కవర్లను రైతులకు అందుబాటులో ఉంచారు. సేకరించిన పంటను ఎప్పటికప్పుడూ గిడ్డంగులకు తరలించేలా లారీలను ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజర్షి షా, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, మార్కెటింగ్, పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది పంట కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నారు. మార్కెట్‌యార్డులను సందర్శిస్తూ పంట సేకరణలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. జొన్న రైతులు ఆందోళన చెందకుండా వారికి ముందుగా సూచించిన ప్రకారం పంటను మార్కెట్‌యార్డులకు తీసుకురావాలని మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

విత్తన వ్యాపారికి షోకాజ్ నోటీసు

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ఆదిలాబాద్, మే 23(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి విత్తనాల కొరత నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం ప్రచురితమైన 'నో స్టాక్' కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, ఆర్డీవో వినోద్ కుమార్‌లు నో స్టాక్ బోర్డు పెట్టిన విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. నో స్టాక్ బోర్డులను తొలగించి లోటుపాట్లను గుర్తించారు. నిబంధనలు పాటించని యజమానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. విత్తనాల విషయంలో వ్యాపారులకు వ్యవసాయ అధికారులు తగు ఆదేశాలు జారీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పుల్లయ్య తెలిపారు.

కల్యాణానికి హాజరైన భక్తులు

కనుల పండువగా నృసింహుని కల్యాణం

నృసింహుని కల్యాణం జరిపిస్తున్న పండితులు

దిలావర్‌పూర్, మే 23 : అతిప్రాచీన దేవాలయమైన శ్రీ కాల్వ లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని బుధవారం శ్రీమాన్ చక్రపాణి నరసింహమూర్తి, శ్రీమాన్ వాసుదేవాచార్యులు ఆలయ పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను భక్తజనంతో కలిసి ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లి కల్యాణం నిర్వహించారు. అంతకు ముందు ఆలయం వద్ద పండితుల ఆధ్వర్యంలో నిత్యార్చన, అగ్ని ప్రతిష్ట, హవనము, ధ్వజారోహణం, బలిహరణం, గరుడ ముద్దల వంటి కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండ ఆలయ చైర్మన్ మహేశ్, ఈవో రవికిషన్ గౌడ్ ఏర్పాట్లు చేశారు. నిర్మల్ పట్టణానికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు రాము, వెంకటేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలి

నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, మే 23 : నిర్ణీత గడువులోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో గ్రామీణాబివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్‌లలో ఎంట్రీ చేయాలని సూచించారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు వీలుగా సరిపడినన్నీ లారీలు, కూలీలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులందరూ ధాన్యాన్ని ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా శుభ్రపర్చే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం మామడ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. జూన్ 5వ తేదీలోపు పనులు పూర్తి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎం శ్రీకళ, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో రమేశ్

పారిశుధ్య పనులపై శ్రద్ధ పెట్టాలి

ఖానాపూర్, మే 23 : గ్రామాల్లో చేపట్టే పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎల్‌పీవో రమేశ్, డీపీవో శ్రీనివాస్‌లు సూచించారు. గురువారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఖానాపూర్, పెంబి మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండల తీవ్రతకు నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. 2024-25కు సంబంధించి డిమాండ్ చేస్తూ ప్రతి ఇంటికి నోటీసులు జారీ చేసి వంద శాతం పన్నుల వసూళ్లకు కృషి చేయాలన్నారు. తాగు నీరు, శానిటేషన్, వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని చెప్పారు. సమావేశంలో ఖానాపూర్ ఎంపీడీవో సునీత, ఎంపీవోలు చంద్రశేఖర్, రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నిర్మల్ అర్బన్, మే 23 : నిర్మల్ జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈవో జాదవ్ పరశురాం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 3,416 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,001 మంది పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం 13 మంది చీఫ్ సూపరింటెండెంట్ అధికారులు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను కేటాయించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు పరుస్తామన్నారు.

ఆదిలాబాద్‌లో 5,871 మంది..

ఎదులాపురం, మే 23 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆదిలాబాద్ డీఐఈవో రవీందర్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరంలో 3420, రెండో సంవత్సరంలో 2451 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 14 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

విత్తన దుకాణంలో పత్తి బ్యాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజీప్రసాద్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజీప్రసాద్

తానూర్, మే 23 : ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజీప్రసాద్ అన్నారు. గురువారం హిప్నెల్లి గ్రామంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యక్తుల ఇండ్లను సోదా చేశారు. ఎలాంటి నకిలీ విత్తనాల బ్యాగులు లభించకపోవడంతో గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం మండల కేంద్రం లో విత్తనాలు, ఎరువుల దుకాణాలకు వెళ్లి విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంజీప్రసాద్ మాట్లాడుతూ.. ఎవరైనా వ్యాపారులు నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు, కల్తీ ఎరువులు, మందులు అమ్మినా వ్యాపార లైసెన్సులు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా రశీదులు తీసుకోవాలని, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. వీరి వెంట ఎస్ఐ లోకం సందీప్, మండల వ్యవసాయ అధికారి గణేశ్, మండల విస్తరణ అధికారులు అంబాదాస్, నవీన్‌లు ఉన్నారు.

పన్నులు వసూలు చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

పెంబి, మే 23 : ప్రతి గ్రామంలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని పెంబి, మందపల్లి గ్రామాల్లో పర్యటించి నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం తోపాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, మే 23 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొలాం, తోటి, కోలావర్ తెగలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు గిరిజన సంక్షేమ ప్రతిభ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో హయత్‌నగర్(హైదరాబాద్) నందు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉట్నూర్ ఆర్‌సీవో గురుకులం కార్యాలయంలో బోనఫైడ్, టీసీ, కులం, ఆదాయం, ఫిజికల్ ఫిట్నెస్, ఆధార్ సర్టిఫికెట్స్, రెండు జతల జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంప్రదించాలని సూచించారు.